## క్లుప్తంగా

### వైద్య శిబిరం

నిజాంసాగర్(జుక్కల్): హసన్‌పల్లిలో మంగళవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 39 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. వైద్యులు తానాజీ సలోని, ఆరోగ్య కార్యకర్త సులోచన, ఆశావర్కర్లు నస్రీన్, పద్మ తదితరులు ఉన్నారు.

### రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): రైతు బీమా పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని ఏఈవో రాకేష్ అన్నారు. ఎర్రాపహాడ్ రైతు వేదిక కార్యాలయంలో మంగళవారం రైతు బీమాపై అవగాహన కల్పించారు. ఈ యేడాది జూన్ 18 వరకు పట్టా పాస్‌పుస్తకాలను పొంది 18 నుంచి 59 ఏళ్ల వయసున్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సందేహాలుంటే రైతు వేదికల్లో తమను కలవాలని సూచించారు. వీఆర్‌ఏ రవీందర్, రైతులు సాయిరెడ్డి, అంజాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

### నులి పురుగుల నివారణకు కృషి చేయాలి

నిజాంసాగర్(జుక్కల్): మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీపై అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు. ఈ నెల 20న అన్ని గ్రామాల్లోని పిల్లలకు, విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఈశ్వర్, సాయిలు, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

### ఆలయ భూముల పరిశీలన

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో ఆక్రమణకు గురైన రామ మందిరం భూముల విషయంలో ఎండోమెంట్ అధికారులలో చలనం వచ్చింది. మంగళవారం ఈవో శ్రీధర్‌రావు ఆక్రమణకు గురైన భూములను పరిశీలించారు. ఆక్రమించిన అందరికీ నోటీసులిచ్చి, సర్వే చేయిస్తామని, కబ్జాలను తొలగిస్తామని అధికారులు తెలిపారు.

### టార్పాలిన్ల పంపిణీ

బీబీపేట: గత రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో మంగళవారం ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్వర్యంలో మండల కేంద్రంలోని 20 మంది నిరుపేదలకు ఇళ్లపై కప్పుకోవడానికి టార్పాలిన్లను పంపిణీ చేశారు. ఇళ్లు, గుడిసెలపై కప్పుకోవడానికి ఇబ్బందులు ఉన్నాయని ఫౌండేషన్ సభ్యులను సంప్రదించగా వారు టార్పాలిన్లను పంపిణీ చేశారు. ఫౌండేషన్ సభ్యులు నీల స్వామి, రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### ఆలయానికి విరాళం

భిక్కనూరు: తిప్పాపూర్‌లోని లక్ష్మీ వేంకటేశ్వరాలయం పునర్నిర్మాణానికి మెదక్ జిల్లా రుద్రారం గ్రామానికి చెందిన అల్లంరెడ్డిగారి మాధవీలతా సుధాకర్‌రెడ్డి రూ.10 వేల111 లను మంగళవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా విరాళ దాతను ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ తాటిపల్లి సిద్ధరాములు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ద్యావర సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### నియామకం

కామారెడ్డి అర్బన్: శ్రీసత్యసాయి సేవా సమితి కామారెడ్డి శాఖ కన్వీనర్‌గా ఎస్.లింబాద్రి నియమితులయ్యారు. అలాగే వివిధ విభాగాలకు సమన్వయకర్తలు నియమితులయ్యారు. ఆధ్యాత్మిక విభాగం(పురుష) సమన్వయకర్తగా సీహెచ్.అశోక్, మహిళా సమన్వయకర్తగా జి.మాధవి, విద్యా విభాగం(పురుష) సమన్వయకర్తగా కేవీ.సురేందర్, మహిళా సమన్వయకర్తగా ఎస్.బాలమణి, సేవా విభాగం(పురుష) సమన్వయకర్తగా పి.హరిశంకర్, మహిళా విభాగం సమన్వయకర్తగా పి.శోభారాణి, యువజన విభాగం(పురుష) సమన్వయకర్తగా డి.శ్రీనివాస్, మహిళా సమన్వయకర్తగా బి.స్వప్నలు నియమితులయ్యారు. రామారెడ్డి మండలం కన్నాపూర్ భజన మండలి సమన్వయకర్తగా జి.లత, కామారెడ్డి పట్టణ పరిధిలోని లింగాపూర్ సమన్వయకర్తగా బండారు బాపురెడ్డిలు నియమితులయ్యారు.

### కొనసాగుతున్న నిరసనలు

భిక్కనూరు: ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ విడుదల చేసే వ్యర్థాల నుంచి కాచాపూర్ గ్రామాన్ని కాపాడాలంటూ వీడీసీ ఆధ్వర్యంలో గ్రామస్తులు చేస్తున్న నిరసన దీక్షలు 85వ రోజుకు చేరుకున్నాయి. మంగళవారం గ్రామస్తులు వర్షంలోనూ దీక్ష శిబిరం వద్ద నిలబడి నిరసన తెలిపారు. చర్యలు తీసుకునే వరకు పోరాటం సాగిస్తామని గ్రామస్తులు తెలిపారు. ఈ దీక్షలో గ్రామస్తులు వి. చంద్రారెడ్డి, సంగేపు దేవయ్య, మర్రి లక్ష్మయ్య, పబ్బుతి రాజేందర్, తదితరులు నిరసన తెలిపారు.

### పారిశుధ్య పనులు చేయించాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామంలో ప్రతి రోజూ పారిశుధ్య పనులు చేయించాలని నాగిరెడ్డిపేట ఎంపీవో శ్రీనివాస్ సూచించారు. పోచారం జీపీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. ప్రతివార్డులో మురికికాలువలను శుభ్రం చేయించాలని సూచించారు. సర్పంచ్ విజితా రెడ్డి, కార్యదర్శి తిరుపతి ఉన్నారు.

# అటవీ భూములు దున్నితే కేసులే

- జుక్కల్ ఫారెస్ట్ రేంజ్ అధికారిణి సంతోష హెచ్చరిక
- కొత్తగా సాగు చేపట్టిన వారికి పట్టాలు రావు



దున్నిన భూములను పరిశీలిస్తున్న అధికారులు



విఠల్‌వాడి తండాలో మూడు గ్రామాల ప్రజలతో సమావేశమైన అటవీ, పోలీసు శాఖాధికారులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): అటవీ భూములను ఎవరైనా దున్నితే వారిపై కేసులు పెడ్తామని జుక్కల్ ఫారెస్ట్ రేంజ్ అధికారిణి సంతోష హెచ్చరించారు. మంగళవారం పోచారం తండా, విఠల్‌వాడి తండా, విఠల్ వాడి గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రెండు రోజుల నుంచి 3 గ్రామాల ప్రజలు కొంత మంది రాత్రి సమయంలో అటవీ భూమిని దున్నుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. పోడు భూములకు ప్రభుత్వం ఇచ్చిన పట్టా ఎవరికైతే ఉందో వారు ఆ ప్రాంతంలోనే సాగు చేసుకోవాలని అన్నారు. దురాశతో ఎక్కువ సాగు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పుడు ఎవరూ అటవీ భూములను కొత్తగా సాగు చేసినా వారికి పట్టాలు రావని తెలిపారు. తహసీల్దార్ దశరథ్, ఫారెస్ట్ డిప్యూటీ రేంజర్ సుజాత, ఎస్సై కోనా రెడ్డి, ఏఎస్సై రాములు, ఎంపీవో సూర్యకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కోసమే జన ఆరోగ్య సమితి



సూచనలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శిరీష

బాన్సువాడ రూరల్: క్షేత్రస్థాయిలో ప్రజలకందే వైద్య సేవలపై ఇక నుంచి పర్యవేక్షణ ఉండనుందని కామారెడ్డి జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో శిరీష అన్నారు. మంగళవారం బాన్సువాడలో బాన్సువాడ, బీర్కూర్ పీహెచ్‌సీల పరిధిలోని ఆరోగ్య సిబ్బంది, ప్రజాప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పల్లె దవాఖాన, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, పట్టణ ఆరోగ్య కేంద్రాల కోసం ఈ జన ఆరోగ్య సమితులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కమిటీల కూర్పు ఎలా ఉండాలో వివరించారు. ఏర్పాటు చేసిన కమిటీలు ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయా లేదా అని పర్యవేక్షిస్తాయన్నారు. ప్రతినెలా సమితి సభ్యులు సమావేశమై మంజూరైన ఫండ్స్, ఖర్చులపై చర్చించాల్సి ఉంటుందన్నారు. ఈసమావేశానికి బాన్సువాడ ఎంపీపీ నీరజా వెంకట్రాంరెడ్డి హాజరై సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజాప్రతినిధులు వారికి సహకరించాలని కోరారు. డాక్టర్లు విజయ మహాలక్ష్మి, శ్రావణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అన్నాబావు సాఠే అందరికి ఆదర్శం



మద్నూర్(జుక్కల్): అన్నాబావు సాఠే ప్రతి ఒక్కరికి ఆదర్శమని, ఆయన అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఎమ్మార్పీస్ నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సోనాల చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన అన్నాబావు సాఠే విగ్రహం వద్ద మంగళవారం ఆయన వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అన్నాబావు సాఠే చేసిన సేవలు మరువలేమన్నారు. నేతలు లక్ష్మణ్, సాయిలు, యాదవ్, మారుతి, పండరి, రాజు తదితరులున్నారు.

## రాహుల్, రేవంత్‌లపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

- కాంగ్రెస్ నేత వడ్డేపల్లి సుభాష్ రెడ్డి



మాట్లాడుతున్న పీసీసీ కార్యదర్శి సుభాష్‌రెడ్డి

ఎల్లారెడ్డి: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిలపై మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకుని క్షమాపణలు చెప్పాలని పీసీసీ కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను అందించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తే సబ్ స్టేషన్లలో రికార్డులను ఎందుకు దాచారని ప్రశ్నించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అఫీజ్, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

## ప్రశాంతంగా కొనసాగిన బీబీపేట బంద్



బంద్ చేయిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బీబీపేట: మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం మండల కాంగ్రెస్ నాయకులు బీబీపేట మండల బంద్ పాటించారు. బీబీపేటతో పాటు పలు గ్రామాల్లోని పాఠశాలలతో పాటు, దుకాణ సముదాయాలను బంద్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో మంత్రులు జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని ప్రకటించారని కానీ ఇప్పటివరకు తరగతులు ప్రారంభం కాలేదని అన్నారు. ఇచ్చిన హామీ నెరవేర్చాలని కోరారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుతారి రమేష్, నాయకులు భూమాగౌడ్, శ్రీహరి, సలీం, మహేష్, రమేష్, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహాల్లో సమస్యల్ని పరిష్కరించండి

- గిరిజన విద్యార్థి నేత వినోద్ నాయక్



వినతి పత్రం అందజేస్తున్న వినోద్

కామారెడ్డి రూరల్: జిల్లాలోని వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వినోద్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వినోద్ నాయక్ మాట్లాడుతూ...గిరిజన ఆశ్రమ వసతి గృహాల్లో ఏఎన్ఎం పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఉపాధ్యాయులను నియమించాలన్నారు. దుస్తులు, పెట్టెలు, భోజన వసతికి అవసరమైన సదుపాయాలు, సరుకులు అందించాలన్నారు. నాణ్యమైన బియ్యాన్ని పంపిణీ చేయాలని కోరారు.

# ఎడతెరిపి లేకుండా వర్షం

జిల్లా వ్యాప్తంగా మంగళవారం భారీ వర్షం కురిసింది. ఆకాశానికి చిల్లు పడిన విధంగా ఎడతెరపి లేకుండా సోమవారం రాత్రి నుంచి వర్షం కురుస్తూనే ఉంది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు చోట్ల వాగులు, వంకలు నిండుగా ప్రవహిస్తున్నాయి. కొన్నిచోట్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. మరి కొన్ని చోట్ల రోడ్లు కొట్టుకుపోయాయి. కొత్తగా వేసిన పంటలు నీట మునిగాయి. – సాక్షి నెట్‌వర్క్



తాడ్వాయి: కాలోజివాడిలో నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు



పొంగి ప్రవహిస్తున్న లింగంపేట పెద్దవాగు



గాంధారి: రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న ఈదుల్ల వాగు



అంకోల్ క్యాంపులో ప్రవహిస్తున్న వాగు



రాజంపేట- కామారెడ్డి రహదారిపై ప్రవహిస్తున్న మొండి వాగు



గర్గుల్ శివారులో పంట పొలాల్లో నిలిచిన నీరు

## మండల పరిషత్ కార్యాలయం లీకేజీలమయం



ఎంపీడీవో చాంబర్‌లో ఊరుస్తున్న వర్షపు నీరు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయం మంగళవారం ఉదయం కురిసిన వర్షానికి పూర్తిగా తడిసి ముద్దయింది. కార్యాలయంలోని దాదాపు అన్నిగదుల పైకప్పు నుంచి వర్షపునీరు కారుతోంది. గతంలో నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయం పైకప్పు పూర్తిగా శిథిలమై చిరుజల్లులకే కార్యాలయం పూర్తిగా లీకేజీలమయంగా మారేది. దీంతో కార్యాలయం పైకప్పు మరమ్మతుల కోసం 2020–21లో అప్పటి కలెక్టర్ రూ.2 లక్షలు మంజూరు చేశారు. ఆ నిధులతో కార్యాలయం పైకప్పుపై డాంబర్ షీట్లను వేసి తాత్కాలిక మరమ్మతులు చేశారు. కాని పనులు చేపట్టిన రెండేళ్లలోనే కార్యాలయం పైకప్పు నుంచి కార్యాలయంలోకి మళ్లీ వర్షపు నీరు వస్తుంది. మంగళవారం కురిసిన వర్షానికి కార్యాలయం మొత్తం లీకేజీలమయంగా మారింది.

## కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె



సాక్షి నెట్‌వర్క్ : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జీపీ కార్మికుల చేపట్టిన సమ్మె మంగళవారం కొనసాగింది. సమ్మెకు వివిధ పార్టీల నేతలు సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కార్మికులు కోరారు. అలాగే మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలో ధర్నా నిర్వహించి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

## ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయం



మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న పార్ట్‌టైం స్వీపర్లు

కామారెడ్డి రూరల్: తమకు కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రమైన కామారెడ్డి ఆర్డీవో కార్యాలయం ఎదుట పార్ట్‌టైం స్వీపర్లు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 15వ రోజుకు చేరుకున్నాయి. అయినా ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించకపోవడం శోచనీయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న తమను ప్రభుత్వం గుర్తించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. చనిపోయిన స్వీపర్ల స్థానంలో వారి వారసులను నియమించాలని కోరారు. విద్యార్హత ఉన్నవారిని అటెండర్‌లుగా నియమించాలని కోరారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. నేతలు జి.బాలయ్య, సిద్ధిరాములు, మునీరొద్దీన్, సయ్యద్ హైమద్, రాములు, సహదేవ్, వీరేశం, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపై ప్రమాదకరంగా గుంతలు

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



పెద్ద ఎక్లార-దన్నూర్ రోడ్డుపై..



పెద్ద ఎక్లార రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంత

మద్నూర్(జుక్కల్): గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులపై ఏర్పడిన గుంతలతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డోంగ్లీ మండలంలోని పెద్ద టాక్లీ, చిన్న టాక్లీ గ్రామాల వద్ద గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రోడ్డుపై ఏర్పడ్డ గుంతల్లో వాహనదారులే రాళ్లు వేసుకొని ప్రయాణాలు సాగిస్తున్నారంటే ఇక్కడ అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. పెద్ద ఎక్లార గ్రామానికి వెళ్లే రోడ్డుపై రెండేళ్ల క్రితం భారీ గుంత ఏర్పడింది. అలాగే పెద్ద టాక్లీ సమీపంలో కల్వర్టు నిర్మించి దానికి రెండు వైపులా రోడ్డు వేయకపోవడంతో ప్రమాదకరంగా మారింది. కల్వర్టు వద్ద వర్షానికి రోడ్డు కిందికి కాగా కల్వర్టు ఎత్తుగా మారడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ విషయమై గ్రామస్తులు అధికారులకు వాట్సాప్ ద్వారా సమస్యలను వివరించారు. ఇప్పటికైనా ప్రమాదకరంగా ఉన్న గుంతలను సిమెంట్, కంకరతో పూడ్చి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.



పెద్ద టాక్లీ వంతెన వద్ద ..



చిన్న టాక్లీ రహదారిలో గుంతల్లో రాళ్లు వేస్తున్న వాహనదారుడు

## పారిశుధ్య పనుల్లో పాలకవర్గం



నిజాంసాగర్(జుక్కల్): పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తుండటంతో మంగళవారం జుక్కల్ మండల కేంద్రంలో గ్రామ సర్పంచ్ రాములు సేట్, ఉప సర్పంచ్ భానుగౌడ్‌తో పాటు వార్డు సభ్యులు పారిశుధ్య పనులు చేపట్టారు. కార్మికులు విధులకు హాజరు కాకపోవడంతో పలు కాలనీల్లోని చెత్తా చెదారం పేరుకుపోయింది. చేసేదేమీ లేక వారే శుభ్రం చేశారు.

## సమాచారం..

■ **నేడు విద్యాహక్కు చట్టంపై సమావేశం**

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం విద్యాహక్కు చట్టంపై సమావేశం నిర్వహించనున్నట్లు సాధన సంస్థ కో–ఆర్డినేటర్ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతోపాటు సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహిస్తామని ఆయన చెప్పారు. విద్యాహక్కు చట్టంతో పాటు బాలల పరిరక్షణ చట్టం, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాలను ఆపుట, తదితర అంశాలపై సమావేశంలో చర్చిస్తామని పేర్కొన్నారు.

**ఆస్పత్రి అభివృద్ధి నిధులపై ..**

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆస్పత్రి నిధులపై సమావేశం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి ఆస్మ తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్ హాజరవుతారని పేర్కొన్నారు. ఆస్పత్రికి మంజూరు అయిన నిధులపై చర్చిస్తారని చెప్పారు.

**రైతుబీమాలో నామినీ పేర్ల మార్పు కోసం..**

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): రైతు బీమాలో నామినీల పేరు మార్పు కోసం ఈనెల 20లోగా వ్యవసాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సిబ్బంది మంగళవారం తెలిపారు. నామినీగా ఉన్న వారు మృతి చెందడం లేదా వివాహమై వెళ్లిన వారు ఉంటే ఆ స్థానంలో ఇతరులను నామినీగా చేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

■ **రేపు ఉచిత లివర్ పరీక్షలు**

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి సిరిసిల్ల రోడ్డులోని ఆదిత్య ఆస్పత్రిలో ఈనెల 20న ఉదయం 10 గంటల నుంచి 12 వరకు చిన్న పిల్లలు, పెద్దలకు లివర్ ఫంక్షన్ టెస్ట్(ఎల్ఎఫ్‌టీ) ఉచితంగా నిర్వహించనున్నట్లు ఆస్పత్రి ప్రతినిధి తెలిపారు. పరిమిత సంఖ్యతో పరీక్షలు నిర్వహించనున్నందున ముందుగా 9299998408, 8886931109 ఫోన్‌చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

## సంక్షిప్తం

**ఎల్లారెడ్డి ఎంపీడీవో మృతికి సంతాపం**



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి ఎంపీడీవో నారాయణ మంగళవారం గుండె పోటుతో మృతి చెందడంతో సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో నారాయణ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ ఉషాగౌడ్, ఎంపీవో ప్రకాష్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులున్నారు.

**టీఎన్‌జీవో నేతలను కలిసిన జిల్లా నాయకులు**

కామారెడ్డి అర్బన్: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం టీఎన్‌జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మామిండ్ల రాజేందర్, జగదీష్‌లతో పాటు రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌లను కలిసినట్టు టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బి.సాయిలు, కేంద్ర సంఘం కార్యదర్శి ఎం.నాగరాజులు తెలిపారు. అనంతరం భాగ్యనగర్ టీఎన్‌జీవోస్ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

**పోచమ్మ ఆలయంలో ఎండీఎం నిర్వాహకుల పూజలు**

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణంలోని ముత్యాల పోచమ్మ ఆలయంలో ఎండీఎం నిర్వాహకులు మంగళవారం పూజలు చేశారు. ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్ తీర్చేలా ఆయన మనసును మార్చాలని వారు అమ్మవారిని వేడుకున్నారు. ఎండీఎం నిర్వాహకుల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చూడాలని కోరారు. నిర్వాహకులు దుర్గవ్వ, సాయిలు తదితరులున్నారు.

**మహాధర్నాను విజయవంతం చేయండి**

బాన్సువాడ: విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 19న నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ కోరారు. బుధవారం ఆయన బాన్సువాడలో ఉద్యమ జాగరణలో భాగంగా సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ పార్టీలో యువకుల చేరిక



బాన్సువాడ: పొతంగల్ మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బాన్సువాడలో వీరికి పొతంగల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పుప్పల శంకర్, మాజీ ఎంపీపీ పవన్, యువజన నాయకులు కాసుల రోహిత్, కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించా రు. రానున్న ఎన్నికల్లో బాన్సువాడలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు ఉద్దర హన్మాండ్లు, మంత్రి గణేష్, కాంత్ రెడ్డి, పులికంటి సాయిలు, తదితరులు పాల్గొన్నారు.